నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, సోమవారం 13 జనవరి 2025 | RANGAREDDY

# స్పెషల్ పేరుతో దోపిడీ..



షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో సాధారణ బస్సుకు స్పెషల్ స్టిక్కర్

- రెగ్యులర్ బస్సులపై ప్రత్యేక స్టిక్కర్లు
- టికెట్‌పై రూ.30 అదనపు చార్జీలు
- మండిపడుతున్న ప్రయాణికులు

షాద్‌నగర్‌రూరల్, జనవరి 12 : సులభతరంగా, క్షేమంగా అందరికీ అందుబాటులో టికెట్ ధరలతో ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తామని చెప్పిన ఆర్టీసీ యంత్రాంగం పండుగ సమయాల్లో ప్రయాణికులపై అధిక భారం మోపుతున్నది. ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందిస్తున్న ఆర్టీసీ నష్టాలబాటలో పయనిస్తున్నది. ఆ నష్టాన్ని భర్తీ చేయాలనుకుందేమోగాని సంక్రాంతి పండుగ వేళ రెగ్యులర్ బస్సులకు సైతం ప్రత్యేక బస్సులంటూ స్టిక్కర్లను అంటించి ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇదెక్కడి అన్యాయమంటూ ప్రయాణికులు బస్సు కండక్టర్‌ను నిలదీస్తుండగా.. మీరు డిపోలో తెలుసుకోండి అంటూ తాపీగా సమాధానం ఇస్తున్నారంటూ ప్రయాణికులు వాపోతున్నారు. మహిళలు ఆర్టీసీలో అధిక సంఖ్యలో ప్రయాణిస్తుండడంతో కండక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారని మహిళా ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు.

## స్పెషల్ బస్సులే నడిపిస్తున్నారు



రోజూ నడిచే బస్సులతో పాటు పండుగ పర్వదినాల్లో ఆర్టీసీ యంత్రాంగం స్పెషల్ బస్సులను నడిపిస్తారు. కానీ ఈ సంక్రాంతి పర్వదినాన ప్రతి బస్సుకు స్పెషల్ స్టిక్కర్లను ఏర్పాటు చేసి అదనపు చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తే బస్సు దిగాలంటున్నారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్‌కు రూ.100 (రూ.30 అదనం)లను వసూలు చేయడం సరికాదు.

**- మహబూబ్, ఆర్టీసీ ప్రయాణికుడు**

## ప్రయాణికుల సౌకర్యార్థం స్పెషల్ బస్సులు



సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. రోజువారీ బస్సులతోపాటు 200 ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. దూరప్రాంతాల ప్రయాణికులను సైతం గమ్యస్థానాలకు చేర్చేందుకు అదనపు బస్సులను నడుపుతున్నాం. ప్రత్యేక బస్సులు నడుపుతుండడంతో హైదరాబాద్ నుంచి రూ.30 అదనపు చార్జీలను వసూలు చేస్తున్నాం. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా మరిన్ని అదనపు బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నాం.

**- ఉష, ఆర్టీసీ డిపో డీఎం, షాద్‌నగర్**



సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారితో ఆదివారం ఎంజీబీఎస్ కిటకిటలాడింది. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా సంక్రాంతికి 6,432 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు టీజీఎస్‌ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీలత వెల్లడించారు. రద్దీ దృష్ట్యా 14వతేదీ వరకు జేబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, సీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఆరాంఘర్ పాయింట్ల నుంచి బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు.

**- సుల్తాన్‌బజార్, జనవరి 12**




సంక్రాంతి సెలవులు, వారాంతం కావడంతో మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటకులతో కిటకిటలాడింది. యువతీయువకులు ఉదయమే కుటుంబ సమేతంగా తరలివచ్చి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. ఆహ్లాదకరమైన ప్రాజెక్టు అందాలను తిలకించి సహపంక్తి భోజనాలు చేశారు. పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

- ధారూరు, జనవరి 12

# హామీలు అమలు చేయమంటే దాడులా..?

- బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు సరికాదు
- బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి జిల్లా కార్యాలయంపై దాడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జిల్లాలో నిరసన కార్యక్రమాలు



ఇబ్రహీంపట్నం ఠాణాలో ఉన్న బీఆర్‌ఎస్వీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 12 : ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగిన పాపానికి దాడులు చేస్తారా..? అని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, బీఆర్‌ఎస్వీ నాయకుడు శివసాయిలు ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై ఎన్‌ఎస్‌యూఐ నాయకులు చేసిన దాడికి నిరసనగా వారు అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వగా.. పోలీసులు రాజ్‌కుమార్, బుగ్గరాములు, భరత్‌రెడ్డి, శివసాయి లు తదితరులను ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హామీలను అమలు చేయాలని అడిగితే బీఆర్‌ఎస్ కార్యాలయాలపై దాడులు చేయడం సరైంది కాదని, ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు.

### అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**యాచారం :** అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఖాజా మహ్మద్ అన్నారు. భువనగిరి బీఆర్‌ఎస్ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ గూండాల దాడిని ఖండిస్తూ ఆదివారం నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వగా.. పోలీసులు పలువురు బీఆర్‌ఎస్ నాయకులను ఆదివారం ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా..? అని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యాలయంపై దాడి చేసి కుర్చీలు విరగ్గొట్టి, కేసీఆర్ ఫ్లెక్సీలను చించేసిన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఖబడ్దార్ కాంగ్రెస్ గూండాల్లారా.. బీఆర్‌ఎస్ జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, వెంకటేశ్ ఉన్నారు.



యాచారంలో బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు

### దాడులను ఉపేక్షించం


**పెద్దఅంబర్‌పేట :** భువనగిరిలో బీఆర్‌ఎస్ మహాధర్నా నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులను నాగోల్ పోలీసులు ఆదివారం ముందస్తుగా అరెస్టు చేశారు. నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకుల దాడి హేయమైనదని, మరోసారి ఇలాంటివి జరిగితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ముందస్తు అరెస్టు అయినవారిలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి దామోదర్, పార్టీ నాయకులు కౌన్సిలర్ పరశురాంనాయక్, గౌరెల్లి మాజీ సర్పంచ్ మల్లేశ్, సీనియర్ నాయకులున్నారు.



పెద్దఅంబర్‌పేట్ : పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

### నిందితులను కఠినంగా శిక్షించాలి

**మంచాల :** బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పార్టీ మంచాల మండలాధ్యక్షుడు చీరాల రమేశ్ అన్నారు. ఆదివారం పార్టీ మండల కార్యదర్శి కాట్రోత్ బహదూర్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య ఇతర సీనియర్ నాయకులతో కలిసి ఆయన మంచాలలో విలేకరులతో మాట్లాడారు. దాడులను ప్రోత్సహిస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..? అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నర్సింగ్, వెంకటేశ్‌గౌడ్, రఘుపతి, శేఖర్, బద్రీనాథ్, విజయ్, కిషన్‌రెడ్డి, యాదయ్య, జానీపాషా, వెంకటేశ్, శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.



మంచాల : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ఆంక్షలతో కట్టడి..

# అన్నదాతల్లో అలజడి..

- రైతు భరోసా అర్హుల కోసం జల్లెడ పట్టనున్న ప్రభుత్వం
- కొండలు, గుట్టలు, వెంచర్లకు ఇక రైతు భరోసా లేనట్లే..
- రంగారెడ్డి జిల్లాలో సగానికి తగ్గనున్న లబ్ధిదారులు
- గత ప్రభుత్వ హయాంలో సాయం పొందిన రైతులు 3,25,216





రంగారెడ్డి జిల్లాలో రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలతో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పడిపోనున్నది. ప్రస్తుతం జిల్లాలో రైతు భరోసా కింద 3,25,216 మంది రైతులు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం ద్వారా పంటలు సాగుచేస్తున్నారు. ప్రతి ఏటా వీరి కోసం ప్రభుత్వం రూ.343.10 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేసింది. కానీ, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన సర్కారు రైతు భరోసా కింద ఆర్థిక సహాయం అందించడానికి అనేక ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షల నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలో రైతు భరోసా కింద లబ్ధిపొందే రైతుల్లో సగానికి తగ్గనున్నారు. ముఖ్యంగా జిల్లాలో వ్యవసాయ భూములు.. వ్యవసాయేతర భూములను గుర్తించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొండలు, గుట్టలు, వెంచర్లల్లో కూడా రైతు పేర్లపై పట్టాలకు గత సర్కారు రైతులకు రైతు బంధు పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించింది. కాని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సాగుకు యోగ్యంగా ఉన్న భూములనే గుర్తించి వారికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను సేకరించే పనిలో ఉన్నారు.

- రంగారెడ్డి, జనవరి 12 (నమస్తే తెలంగాణ)

### జిల్లాలో 12,42,504 ఎకరాల భూములు

రంగారెడ్డిజిల్లాలో మొత్తం 12, 42,504 ఎకరాల భూములున్నాయి. ఇందులో 805 లక్షల ఎకరాల వ్యవసాయేతర భూములున్నాయి. నగర శివారుల్లో విస్తరించి ఉన్న రంగారెడ్డిజిల్లాలో శంషాబాద్, రాజేంద్రనగర్, మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్, మొయినాబాద్, శంకర్‌పల్లి లాంటి మండలాల్లో రియల్ ఎస్టేట్ పుణ్యమా అంటూ భూములన్నీ ప్లాట్లుగా మారిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో మంచాల, యాచారం, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి, కందుకూరు, కడ్తాల్, షాద్‌నగర్, కొందుర్గు, కొత్తూరు తదితర మండలాలు మాత్రమే వ్యవసాయానికి యోగ్యంగా ఉన్నాయి. ఈ భూముల్లో సాగుచేస్తున్న రైతులకు మాత్రమే రైతు బంధు సాయం అందుతున్నది. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో యాసంగిలో 1,39,000 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలను సాగుచేశారు. దీంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంటలు సాగు చేసే రైతులకు మాత్రమే ఆర్థిక సాయం అందనున్నది. జిల్లాలో గతంలో వందల ఎకరాల భూములు కొనుగోలు చేసిన వారు కూడా రైతు బంధు పథకం కింద పరిహారం తీసుకునేవారు. జిల్లాలో భవిష్యత్తులో ఎక్కువ శాతం భూముల ధరలు పెరిగే అవకాశమున్నందున కొండలు, గుట్టలు, రాళ్ల భూములు కూడా కొనుగోలు చేశారు. ఈ భూములకు కూడా రైతు బంధు వర్తించేది. ప్రస్తుత ప్రభుత్వ లెక్కల ప్రకారం కొండలు, గుట్టలు వంటి ప్రాంతాలకు కూడా రైతు బంధు వచ్చే అవకాశాలు లేవు. దీంతో జిల్లాలో రైతు భరోసా గణనీయంగా తగ్గే అవకాశమున్నది.



### గతంలో భూమి ఉన్న ప్రతి రైతుకూ రైతు బంధు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగుతో సంబంధం లేకుండా భూమి ఉన్న ప్రతి రైతుకూ రైతు బంధును అందించింది. కాని, ప్రస్తుత సర్కారు సాగుకు యోగ్యమయ్యే భూములు, యోగ్యంకాని భూములు, కొండలు, గుట్టలను గుర్తించే పనిలో పడింది. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం రైతు బంధు తీసుకుంటున్న రైతుల్లో రైతు భరోసాకు లక్ష మందికి కూడా భరోసా అందుతుందనే భరోసా లేకుండా పోయింది. సంక్రాంతి తర్వాత సాగుకు యోగ్యమైన భూములను మాత్రమే గుర్తించి వారికే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలోని జిల్లాస్థాయి అధికారులందరితో సమావేశం నిర్వహించి, సాగుకు యోగ్యమైన భూములను గుర్తించాలని ఆదేశాలు జారీచేశారు. గత సర్కారు హయాంలో 3.22 లక్షల మంది రైతులను రైతుబంధు పథకం కింద అర్హులుగా ఎంపిక చేసింది. వీరికి ఏటా రూ.343.10 కోట్ల నిధులను వారి ఖాతాల్లో జమచేసేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాలో పెట్టిన ఆంక్షల ఫలితంగా ఇందులో సగం మంది రైతులకు కూడా రైతు భరోసా అందే అవకాశాలులేవు. దీంతో జిల్లాలో రైతు బంధు పథకం కింద అర్హులైన రైతుల కోసం నేటి నుంచి సర్కారు జల్లెడపట్టే అవకాశాలున్నాయి.



# సంక్రాంతి సందడి..



హిందువులు జరుపుకొనే పండుగల్లో సంక్రాంతి ఒకటి. దీనిని చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ సంతోషంగా నిర్వహించుకుంటారు. సరదాల సంక్రాంతిని ఘనంగా జరుపుకొనేందుకు పట్నాలు, నగరాల నుంచి ప్రజలు గ్రామాలకు చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొన్నది. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలతో మూడు రోజులపాటు గ్రామాలు, పట్టణాలు కళకళలాడనున్నాయి. గాలిపటాలు ఎగురవేయడంలో యువత నిమగ్నమైనది. వివిధ రకాల ఆకారాల్లో ఉన్న గాలిపటాలు, రంగుల ప్యాకెట్ల కొనుగోలులో బిజీగా ఉండడంతో షాపులు కిటకిటలాడుతున్నాయి.

**- షాద్‌నగర్ టౌన్/ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 12**

